క్లుప్తంగా

మహాభారతం ఉత్సవాలకు చెవిరెడ్డి విరాళం



ఆలయ కమిటీ పెద్దలకు సారె అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పక్కన సర్పంచ్ సూరి

తిరుపతి రూరల్: మండలంలోని ముండ్లపూడిలో జరుగుతున్న మహాభారతం ఉత్సవాలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి భారీ విరాళం ప్రకటించారు. ఆదివారం గ్రామంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి రూ.1,01,116 నగదు అందజేశారు. అలాగే అమ్మవారికి సారె సమర్పించారు. ఆయనకు సర్పంచ్ సూరి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. హరికథ గానం చేస్తున్న కళాకారులకు నగదు బహుమతి అందించారు.

మాలిన్‌బీ కుటుంబ సభ్యులకు హర్షిత్‌రెడ్డి పరామర్శ



మాలిన్‌బీ కుటుంభ సభ్యులతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల : దామలచెరువుకు చెందిన మాజీ ఎంపీటీసీ నాగూర్ తల్లి మాలిన్‌బీ ఇటీవల మృతి చెందారు. ఆమె కర్మక్రియలు ఆదివారం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునిత, వైస్ సర్పంచ్ ఇమ్రాన్, రహీం, హరిప్రసాద్‌రెడ్డి, శివప్రసాద్, జయదేవ్, తదితరులు పాల్గొన్నారు.

సంతలో అన్నదానం



చంద్రగిరి సంతలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చెవిరెడ్డి కుటుంబం రైతన్నలకు అండగా ఉందని వైఎస్సార్ సీపీ చంద్రగిరి టౌన్ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో చంద్రగిరి వారపు సంతలో ఆదివారం రైతులు, వ్యాపారులు, చుట్టుపక్కల గ్రామల ప్రజలకు అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుంటే, చంద్రగిరి నియోజకవర్గ రైతుల కోసం ప్రతి సంతలో చెవిరెడ్డి అన్నదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీనిఖిత రీడింగ్ హోమ్ ప్రారంభం



నిఖిత రీడింగ్ హోమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, రఘురామిరెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి బాలాజీ కాలనీలో విద్యార్థుల చదువుల కోసం శ్రీనిఖిత రీడింగ్ హోమ్‌ను అందుబాటులోకి తీసుకురావడం శుభ పరిణామమని కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన ఆదివారం రీడింగ్ హోమ్‌ను ప్రారంభించారు. నెలసరి తక్కువ అద్దెతో విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా సౌకర్యాలు కల్పించారని తెలిపారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సప్త ఋషీశ్వర తీర్థంలో ప్రతాప్ స్వామీజీ పూజలు



సప్తరుషీశ్వర తీర్థంలో పూజలు చేస్తున్న ప్రతాప్ స్వామీజీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం కొటాల పంచాయతీ పాండురంగయ్య గారిపల్లె సమీపంలో వెలసిన పార్వతాంబ సమేత సప్త ఋషీశ్వర తీర్థాన్ని ఆదివారం ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ సందర్శించి పలు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో, ప్రకృతి అందాల నడుమ ఉన్న ఈ తీర్థం గొప్ప విశిష్టతగలదని తెలిపారు. ఈ తీర్థాన్ని దర్శించిన వారికి కోరిన కోరికలు తప్పకుండా ఫలిస్తాయని చెప్పారు. అంతేగాక అష్టైశ్వర్యాలు కలుగుతాయన్నారు.

పేదల ఇంటికే ప్రభుత్వ వైద్యుడు

- ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా వైద్య సేవలు
- దీర్ఘకాలిక రోగులకు మరింత మేలు
- ఖర్చులు, సమయం ఆదా



చిన్నరామాపురంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం



రోగి ఇంటికే వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న ప్రభుత్వ వైద్యులు (ఫైల్)

చంద్రగిరి(తిరుపతి రూరల్): గతంలో నిరుపేదలకు వైద్యం అందని ద్రాక్షగా ఉండేది. వైద్యం కావాలంటే వ్యయ ప్రయాసలకు కోర్చి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ డాక్టర్లు అందుబాటులో ఉండేవారు కాదు. ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్ చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. చిన్న జబ్బు వచ్చినా రూ.వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ప్రజలు పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుర్తించారు. రెండువేల జనాభాకు ఒక్క వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారు. అదేవిధంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. చంద్రగిరి మండలంలో అన్ని పంచాయతీల్లో హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో 14 రకాల పరీక్షలు చేస్తున్నారు. 72 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారు. షుగర్, బీపీ, డెంగీ, మలేరియా, చికున్‌గునియా, పక్షవాతం, గుండె సంబంధిత రోగులకు మందులు, మాత్రలు ఇస్తున్నారు. నయంకాని రోగాలు ఉంటే అలాంటి వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా నెట్ వర్క్ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అలాగే గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడం, ఓవర్ హెడ్ ట్యాంకులు క్లోరినేషన్ తదితర పనులు చేయిస్తున్నారు.

చంద్రగిరి మండలంలో సీహెచ్‌సీలు –	2
పీహెచ్‌సీలు –	2
జూన్‌లో నిర్వహించిన క్యాంపులు –	56
పరీక్షించిన రోగులు –	14,698
బీపీ –	1564
డయాబెటిస్ –	1234
జనరల్ ఓపీలు –	820
గర్భిణులు –	391
బాలింతలు –	88
కేన్సర్ –	07

రెండుసార్లు ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వద్ద నెలకు రెండు సార్లు ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ప్రభుత్వ వైద్యుడు, ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, డీఈవో, ఆశా వర్కర్లు గ్రామానికి చేరుకుని సేవలు అందిస్తున్నారు. అవసరమైన వారికి ఇంటికే వెళ్లి వైద్య సేవలు చేస్తున్నారు. వారి ఆరోగ్య వివరాలను రికార్డు చేస్తున్నారు. వారికి 15 రోజులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితి, వారి ఎదుగుదల, రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే పక్షవాతం, గుండె, కిడ్నీ, ఇతర సంబంధిత దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వైద్య సలహాలు, సూచనలు చేస్తున్నారు.

పీహెచ్‌సీకి రావాలంటే కష్టం



మా గ్రామం నుంచి పీహెచ్‌సీకి వెళ్లాలంటే రెండు బస్సులు మారాలి. ప్రస్తుతం వైద్యసిబ్బంది మా ఇంటికే వచ్చి నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. నెలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే వైఎస్సార్ క్లినిక్ కి వెళితే బాగా చూస్తున్నారు.
– సుబ్రమణ్యం, తాటికోన, చంద్రగిరి.

గతంలో మందులు ఇచ్చే వారు కాదు



నాకు పక్షవాతం వచ్చింది. ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్నాను. గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రికి వెళితే మందులు కూడా ఇచ్చేవారు కాదు. ప్రస్తుతం మా ఇంటికే వచ్చి పరీక్షలు చేసే మందులు ఇస్తున్నారు. ఆరోగ్యం కుదుటపడుతుంది.
– మునిరామయ్య, నరసింగాపురం

ప్రతి ఒక్కరికీ వైద్యం



ఇంటింటికీ వైద్యంలో ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తున్నాం. విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రతిరోజూ ఓపీలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. నెలకు రెండుసార్లు ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నాం. – డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్, చంద్రగిరి

లోకేష్‌లో నాయకత్వ లక్షణాలు శూన్యం

- తిరుపతిలో అలజడి సృష్టిస్తున్న టీడీపీ నేతలు
- ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆరోపణ



అజయ్ కుమార్‌పై జరిగిన హత్యాయత్నంపై మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి తుడా: అల్లర్లు చేసిన వారు, ఎక్కువ కేసులు ఉన్న వారికి టీడీపీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పోస్టులు ఇస్తామని నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అజయ్ కుమార్‌పై టీడీపీ నాయకులు దాడి చేసిన ఘటనపై ఆయన స్పందించారు. గాయపడి నారాయణాద్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అజయ్ కుమార్‌ను ఆదివారం ఉదయం పరామర్శించారు. దాడికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ అజయ్ కుమార్‌ను హత్య చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించడం దారుణమన్నారు. ప్రశాంతంగా ఉన్న తిరుపతిలో టీడీపీ నాయకులు హింసను ప్రేరేపించి అలజడి సృష్టించడం దురదృష్టకరమన్నారు. నాయకత్వ లక్షణాలు లేని నారా లోకేష్ లాంటి వ్యక్తుల పిలుపు మేరకు టీడీపీ శ్రేణులు హింసకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ కార్యాలయంలోకి వచ్చి దాడులకు తెగబడ్డారంటే వారి వెనక ఎంత బలమైన కుట్ర ఉందో తెలుస్తోందన్నారు. తిరుపతి నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ తరుణంలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు చేయడం దుర్మార్గమన్నారు. చుట్టుపక్కల వారు అడ్డుపడకుండా ఉండి ఉంటే అజయ్ కుమార్‌ను చంపేసేవారని తెలిపారు. లోకేష్ పిలుపువల్లే కొంతమంది దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి వాటిని ఉపేక్షించబోమన్నారు.

లోకేష్ మాటలతోనే టీడీపీ నేతల దాడులు



మాట్లాడుతున్న పసుపులేటి సురేష్

తిరుపతి కల్చరల్: ఎక్కువ కేసులు ఉన్న వారికి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు ఇస్తానని నారా లోకేష్ చెప్పడంతో ఆ పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు పసుపులేటి సురేష్ తెలిపారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆటోనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆర్.అజయ్‌కుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన టీడీపీ యువతకు చెందిన జ్ఞానేశ్వర్ అలియాస్ నాని, మంగళంకు చెందిన సతీష్ అలియాస్ నాని 30 మంది యువకులతో కలిసి దాడి చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఎంతటికైనా బరితెగించే నైజం తెలుగుదేశం పార్టీకే ఉందన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టడంతోపాటు టీడీపీ నేతలు, కార్యకర్తలను అల్లర్లు చేసేలా బహిరంగ సభల్లో రెచ్చగొట్టడం ఆ పార్టీ అధినాయకులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దీనా, సాయి, శివ, బాలాజీ, ప్రసాద్, హరి, వినోద్ పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి అయ్యప్ప మాలధారణ



కపిలేశ్వరాలయంలో అయ్యప్ప మాలధారణ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి కల్చరల్: రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం కపిలేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణ చేశారు. ఉదయం ఆలయానికి చేరుకున్న మంత్రి స్నానం ఆచరించి అర్చక పండితుల నుంచి భక్తి ప్రపత్తులతో అయ్యమాల ధరించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం



సుధాకర్, నాగచెంగమనాయుడు, వెంకటరమణ, సుబ్రమణ్యం, హరినాథ రెడ్డి



భూషణ, విశ్వనాథ రెడ్డి, దమరకనాథ గుప్త, మాబూసాహెబ్, హేమంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని పంచాయతీలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించినట్లు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దేవరకొండకు సుధాకర్, చిట్టేచెర్లకు నాగచెంగమనాయుడు, దీన్‌దార్లపల్లెకు షాబాద్‌అలీఖాన్, భాకరాపేటకు వెంకటరమణ, ఎగవూరుకు సుబ్రమణ్యం, దిగవూరుకు హరినాథరెడ్డి, నెల్లుట్లవారిపల్లెకు నరసింహారెడ్డి, తిప్పిరెడ్డిగారిపల్లెకు ఆర్.భూషణ, జంగావాండ్లపల్లెకు విశ్వనాథరెడ్డి, చిన్నగొట్టిగల్లుకు దమరకనాథగుప్త, రంగన్నగారిగడ్డకు మాబూసాహెబ్, కోటబైలుకు హేమేంద్రరెడ్డి, చట్టేవారిపాళెంకు శంకర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారిని కోరారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ

- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి
- నెహ్రూనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం

తిరుపతి తుడా: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం నెహ్రూనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు పొందిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా 15 శాతం ఉన్న ధనికుల కోసమే పనిచేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించారని తెలిపారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతోందని వివరించారు. పేద పిల్లలకు మెరుగైన విద్య అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశారని చెప్పారు. చంద్రబాబు కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ కల్పనా యాదవ్, డివిజన్ నాయకులు యాదవ కృష్ణ, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ ఇమ్రాన్, ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ నైనార్ శ్రీనివాసులు, గంగమ్మగుడి చైర్మన్ కట్టా గోపీ యాదవ్, కో ఆప్షన్ సభ్యురాలు శ్రీదేవి, నాయకులు పసుపులేటి రవి, శ్రీనివాసులు, వినయ్ రాయల్, కంకనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

79 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద శ్రీకాళహస్తి–తిరుపతి ప్రధాన రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి ఆదివారం రాత్రి తెలిపారు. ఆయన కథనం..ముందస్తు సమాచారం మేరకు మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద ఏపీ 39 యూఏ8213 అశోక్ లేలాండ్ దోస్త్ ఎల్ఎస్ వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో 4,030 కిలోల బియ్యం ఉన్న 79 ప్లాస్టిక్ బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,45,080. వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మొదలియార్‌కు అప్పగించారు. బియ్యాన్ని తరలిస్తున్న కేవీబీపురం మండలం కోవనూరుకు చెందిన సాంబారు మనోజ్(25)ను అరెస్ట్ చేశారు.

ముక్కంటి సేవలో న్యాయశాఖ కార్యదర్శి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సత్య భాస్కరరావు తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ దక్షిణగోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వాతంత్య్ర ఉద్యమంలో ఆంధ్రుల పాత్ర విశిష్టమైంది



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: స్వాతంత్య్ర ఉద్యమంలో ఆంధ్రుల పాత్ర విశిష్టమైందని, ఆంధ్రుల త్యాగాలు ప్రశంసనీయమైనవని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కె.అప్పస్వామి పిళ్లై తెలిపారు. ఎస్కే యూనివర్సిటీ పూర్వ కులపతి కె.వెంకటరెడ్డి రచించిన భారత స్వాతంత్య్ర సమరంలో ఆంధ్రుల త్యాగాలు పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కన్నెగంట హనుమంతు, అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పొట్టి శ్రీరాములు తమ ప్రాణ త్యాగాలతో దేశ చరిత్రలో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని కొనియాడారు. ఎస్పీడబ్ల్యూ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సి.స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ అలనాటి దేశభక్తుల చరిత్రలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అదేవిధంగా ఆచార్య కె.వెంకటరెడ్డి ఆంగ్లంలో రచించిన ది యూనివర్సిటీ ఐ సర్వ్‌డ్ అనే మరోక పుస్తకాన్ని ఎస్వీయూ పూర్వ ఉపకులపతి పి.మురళి ఆవిష్కరించారు. సాకం నాగరాజు, రాయప్రోలు సోము ఉమాపతి, తిరుపతి ఆర్ట్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు హేమాక్షి ఆచారి, ఇస్తాపురం బాలసుబ్రమణ్యం, విశ్రాంత ఆచార్యులు ఎన్వీ.నారాయణ, కె.వెంకటాచలపతి, కేవీ.శ్రీనివాసకుమార, కె.విజయ, ఎం.వెంకటరామిరెడ్డి, కె.బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యువతకు మేల్కొలిపే చిత్రం మనసిస్తావా



మాట్లాడుతున్న మనసిస్తావా చిత్రం దర్శకుడు రవిచంద్రారెడ్డి

తిరుపతి కల్చరల్: నేడు యువత ప్రతి చిన్న విషయానికీ మనస్తాపం చెంది తొందరపాటు నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోతను మిగుల్చుతున్నారని దర్శకుడు రవిచంద్రారెడ్డి తెలిపారు. అలాంటి వారికి ఆత్మహత్య ఎంత తప్పిదమో తెలియజేస్తూ యువతకు కనువిప్పు కలిగించే సందేశాత్మక చిత్రం మనసిస్తావా అని పేర్కొన్నారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలోని యువత, కళాకారులను ప్రోత్సహిస్తూ సమాజానికి మంచి సందేశాత్మక చిత్రాన్ని అందించాలనే సంకల్పంతో ఈ చిత్రాన్ని నిర్మించినట్టు చెప్పారు. సమాజ శ్రేయస్సుకు తమ వంతు సహకారం అందించాలనే ఈ చిత్రాన్ని రూపొందించామన్నారు. ఈ చిన్న చిత్రాన్ని సోమవారం థియేటర్లలో విడుదల చేస్తున్నామని, ప్రజలందరూ చూసి ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో నిర్మాతలు శివారెడ్డి, నక్కా రాజేంద్రప్రసాద్, నటులు కృష్ణమూర్తి, శాస్త్రి పాల్గొన్నారు.

పరాశరేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): యోగిమల్లవరంలోని కామాక్షి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేలు చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఆదివారం ఆలయ ధర్మకర్తల మండలి ప్రథమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి నిర్ణయాలను తీసుకున్నారు. ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ ఆవరణలో విశేష పర్వదినాలైన శివరాత్రి, కార్తీక మాసం తదితర పర్వదినాల్లో విశేష సేవలు నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవం నిర్వహించేందుకు మండపం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ మండపం నిర్మాణానికి టీటీడీ నిధుల కోసం దరఖాస్తు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆలయానికి చెందని గోవులు అధికంగా ఉండటంతో వాటిలో 15 గోవులను టీటీడీ గోశాలకు తరలించాలని నిర్ణయించామన్నారు. ఆలయ తూర్పు, ఉత్తర మార్గాల్లో దాతల ద్వారా ఆర్చిలను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆలయానికి చెందిన 2.13 ఎకరాల భూమిపై కోర్టులో కేసు నడుస్తోందని, దాన్ని త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓతో పాటు బోర్డు సభ్యులు వాసు, భారతి, రేణుక, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మకు పొంగళ్లు



అంకమ్మ ఆలయం ముందు భక్తుల సందడి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వేణుగోపాలపురంలోని గ్రామదేవత అంకమ్మకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్లు పెట్టారు. అంబలి పోసి మొక్కులు చెల్లించారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేసి, హోమాలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.